

# శాంతి

అజీజ్

"ఇన్నాళ్ళూ మనం రాత్రీ, పగలూ అనక, నిద్రాహారాలు మాని, ఏ ప్రయోగం కోసమైతే శ్రమించామో, దాని ఫలితాన్ని ప్రత్యక్షంగా వీక్షించే సమయం ఈ రోజు ఆసన్నమైంది. ఈ సందర్భంలోనే మీకు మరి కొన్ని విషయాలు సోదాహరణలతో సహా ఉటంకించ దలచాను.

శాస్త్రజ్ఞుడి జీవితం త్యాగ నిరతికి దర్పణం వంటిది. తన మేదస్సునూ, శారీరక శక్తినీ ప్రతిఫలాపేక్షకు అతీతంగా, ప్రయోగాల పరిధికి అంకితం చేసి, భౌతిక సుఖాలను తృణప్రాయంగా త్యజించి, సూక్ష్మాతిసూక్ష్మమైన ప్రకృతి రహస్యాలను ఛేధిస్తూ, వాటిని మానవ మనుగడకు అన్ని విధాలా అనువైన రీతిలో రూపొందిస్తూ, నిరంతరం క్రొంగొత్త విషయాలను సృష్టించడంలోనే శాస్త్రవేత్త జీవితకాలం హరించుకుపోతుంది.

తుదకు అతనికి మిగిలేదల్లా నిలువెత్తు పూలమాలలూ, అభినందన సభలూ మాత్రమే। అలాగే, శాస్త్రజ్ఞుడు ప్రారంభించిన ప్రతి ప్రయోగమూ ఫలప్రదమౌతుందనుకోడం కూడా భావ్యం కాదు. విజయాన్ని వెన్నంటుతూనే ఓటమి కూడా ఉంటుందని మర్చిపోరాదు. విజయం వరిస్తే చంకలు గుద్దుకుని, ఓటమి లభిస్తే ఉస్సూరుమంటూ చతికిలబడటం ఉత్తమ శాస్త్రజ్ఞుడి లక్షణం కాదు.

ఆ ఓటమికి కారణాలు కనుగొని, నూతన స్ఫూర్తితో మళ్ళీ తన కృషికి శ్రీకారం చుట్టి, చివరి మజిలీ చేరుకోవడానికి శ్రమించాలి.

విద్యుద్దీపానికి వెలిగిచ్చి, ఆధునిక జగత్తును తేజోవంతం జేసిన ఎడిసన్, ప్రింటింగ్ ప్రెస్‌కు ప్రాణం పోసిన గుటెన్‌బర్గ్, గడియారానికి భ్రమణం నేర్పిన హ్యూగెన్స్, డీజిల్ ఇంజన్‌కు జీవంపోసిన రొడాల్ఫ్ డీజిల్, రేడియోకు ఊపిరి ఊదిన మార్కొనీ, టెలివిజన్ని సృష్టించిన జాన్ ఎల్ బైర్డ్, విమానానికి విహంగాలమర్చిన రైట్ తమ గమ్యాలు చేరడానికి ఎన్ని అడ్డంకులూ, అవరోధాలూ, అవహేళనలూ సహించలేదు?

ఇవన్నీ మీకెందుకు చెబుతున్నానంటే, ఈ రంగంలో సుమారు నలభై ఏళ్ళ అనుభవం గడించి, అనేక ఒడిదుడుకులు చవిచూసి, జవసత్వాలుడిగి శైవదశకు చేరుకున్న వయోవృద్ధుణ్ణి నేను. ఈ ప్రాంగణంలో ఇప్పుడే పాదం మోపి, తొలి ప్రయత్నానికి నాంది పలికిన చిరుదీపాలు మీరు।

ఒకనాడు నా ఊహల్లో రూపుదిద్దుకున్న 'అస్ట్రోపామ్ టెలిస్కేనర్'కు

సజీవాకృతి నివ్వడానికి ఇంతకాలం నాతో సహకరిస్తూ, మీ యువమేధా సంపత్తిని వెచ్చిస్తూ అవిరామంగా కృషిజేశారు. ఈనాడు దాని ఫలితం సఫలమైతే సంతోషమే!

దురదృష్ట వశాత్తూ ప్రతికూల ఫలితం ప్రాప్తిస్తే మీరు నిరాశ నిస్పృహలతో డస్సిపోవద్దు. మీ ముందు ఇంకా ఎంతో విశాలమైన భవిష్యత్తు ఉందనీ, మీ సేవలతో భావితరం మనుగడ మరింత మెరుగులు దిద్దుకుంటుందనీ మరవద్దు!

విజ్ఞానానికి అంచులూ, అవధులూ అనేవి ఉండవు. ఎంత సాధించినా, ఎన్ని కనిపెట్టినా ఇంకా ఏదో, ఏ మూలో మన మస్తిష్కపు అంచుకు అందకుండా మిగిలిపోతుంది. ఇది ఒక సాధన, అంతులేని తపస్సు! అర్థమైందా?" అంటూ ముగించారు ప్రొఫెసర్ విశ్వనాథంగారు.

తలూపాను నమ్రతగా. "నాలోని విజ్ఞాన జిజ్ఞాసను వికసింపజేసి, మార్గదర్శకులై, కలసి పనిజేసే అవకాశం ప్రసాదించిన పూజ్యులూ, గురుతుల్యులూ మీరు. మీ సలహాలూ సూచనలూ నాకు శిరోధార్యాలు!" అన్నాను భక్తిప్రపత్తులతో.

నవ్వుతూ, పక్కనే కూర్చున్న కూతురివైపు చూశారు ప్రొఫెసర్.

"శ్రీధర్‌గారు నాకన్నా ముందే నా అభిప్రాయాలను వ్యక్తంజేశారు నాన్నా!" అంది సుమలత. ఆయన నా వైపు తిరిగి, "శ్రీధర్! మన టెలిస్కానర్ నిర్మాణంలో. కంప్యూటర్ విభాగం సెంట్రల్ మైక్రో ప్రాసెసింగ్ యూనిట్ లోపల సిలికాన్ చిప్ బిగించటం, అల్గాల్ ఫోర్ట్రాన్ ప్రోగ్రామింగ్‌ను పొందుపరచడంతో నీ వంతు పని ఇక పూర్తయినట్టే.

ఇక టెలివిజన్ సిస్టమ్‌లో కెమికల్ ట్యూబ్స్ క్రమబద్ధం చేసే సుమలత పని మిగిలిపోయిందిప్పుడు. ఆ తరవాత నా అస్ట్రానమీ ప్రోగ్రామింగ్ పాచ్ వర్క్ ఉంటుంది. నువ్విక్కడే కూర్చుని ఎదురు చూస్తూండు. సుమలత నాతో లాబొరేటరీలోకి వచ్చి, తన పనిముగించి వచ్చేస్తుంది.

ఆ తరవాత నా పనిలో మీరిద్దరూ నా వెంట ఉండటం క్షేమంకాదు. ఎందుకంటే, తుది మెరుగులు దిద్దే సమయంలో ఏ చిన్న ఏమరపాటు జరిగినా, ఆ మంత్రదర్పణం భయంకరమైన శబ్దంతో పేలిపోయే ప్రమాదముంది.

దైవకృప లేకుంటే ఒక్కోసారి మానవ ప్రయత్నం నిలువునా నేలమట్టం కావచ్చు. ప్రాణహాని జరిగితే ఒక్కరికే జరగాలి గానీ, ఈ ప్రయత్నంలో ఒకే సారి మూడు ప్రాణాలు బలికావడం సమంజసం కాదు.

నా పని పూర్తయ్యాక మిమ్మల్ని పిల్చి, మానవ మేధస్సునూ, ఆధునిక జగత్తునూ ఆశ్చర్యాంబుధిలో ముంచివేసే ఆ టెలిస్కానర్ పనితీరును మీకు ప్రత్యక్షంగా చూపిస్తాను. సరేనా!" అన్నారు.

తలూపేను మౌనంగా.

ఆ తండ్రీకూతుళ్ళిద్దరూ లేచి లాబొరేటరీలోకి నడిచారు. టేబిల్‌మీది జార్‌లోంచి గ్లాసులో నీళ్ళు ఒంపుకుని తాగి, సిగిరెట్ అంటించాను. ఖగోళ శాస్త్రంలో విశ్వనాథంగారికి జాతీయస్థాయిలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలోనూ మంచి ప్రాచుర్యమూ, పరపతీ ఉన్నాయి. అస్ట్రానమీలో ఆయన తొక్కిన కొన్ని కొత్తపుంతలు అనేక దేశాల శాస్త్రజ్ఞులకు మార్గదర్శకాలయ్యాయి.

ఏడాది క్రితం, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పుచ్చుకుని, శాస్త్రీయ పరిశోధనలపై ఆసక్తి ఉన్న ఒక అసిస్టెంట్ కావాలని ఆయన పత్రికల్లో ప్రకటించగానే ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ ఉద్యోగానికి అప్లైజేశాను. ఇంటర్వ్యూకు వచ్చిన అనేకమంది అభ్యర్థుల్లో, యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్టునైన నన్ను తన అసిస్టెంట్‌గా ఎంపిక జేసుకున్నారాయన. నాతోబాటు ఆయన కూతురు సుమలత కూడా రెండో అసిస్టెంట్‌గా పనిజేస్తోందిక్కడ.

ఆమె వయసులో చిన్నదే అయినా, నా కన్నా రెండాకులు ఎక్కువే చదివింది. ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్.

తాను రూపొందించదలచిన 'ఆస్ట్రోపామ్ టెలిస్కానర్'గురించి ఆయనముందు మా ఇద్దరికీ వివరించినప్పుడు, నాకా ఆలోచన అతిశయోక్తిగానూ, అనూహ్యంగానూ, అసంభవంగానూ తోచింది. కాని, తరవాత ఆయన ఉదాహరణలతో సహా దాని గురించి వివరించినప్పుడు ఆ ఊహ సంభవమేమో అనిపించక పోలేదు.

మానవుని జనన సమయాన అంతరిక్షంలో జరిగే సూర్య సంచారమూ, తద్వారా ఇతర గ్రహాల గతివిధులూ, వాటిలో సంభవించేపరిణామ ప్రభావాలూ భూమండలంమీదా, తద్వారా ఆ మనిషి మస్తిష్కంమీదా, శరీరంమీదా, భూత భవిష్యత్పరిణామాల మీదా తప్పక పడితీరతాయని ఈనాడు ప్రపంచమంతా నమ్ముతున్న నగ్నసత్యం.

ఈ సూత్రాధారంపైనే జ్యోతిష్య శాస్త్రం ఆవిర్భవించి, ప్రాచీన కాలం నించీ ఈ ఆధునిక యుగంవరకూ విస్తరిస్తూ ఖచ్చితమైన ఫలితాలను ప్రకటిస్తోంది. ఉదాహరణకు ఒక మనిషి ఆగష్టు పదవ తేదీన రాత్రి తొమ్మిది గంటల ముప్పై నిమిషాలకు జన్మించాడు అనుకుందాం! జ్యోతిష్యులు ఆయా నెలా, తేదీ, వారమూ, గంటలూ, నిమిషాలూ సంవత్సరాన్ని తమ పద్ధతిలో గుణించి, ఆయా సమయాల్లో నవగ్రహాల గతివిధుల్ని అంచనా వేసి, జన్మరాశి ఫలితాలనూ, కుజదోష వివరణలూ, ప్రతిదిన గ్రహస్ఫుటం, వధూవర


గుణసమ్మేళన రాశి కూటాది చక్రాలనూ, వివిధ రాశుల్లో గ్రహ ప్రవేశాలనూ వివరిస్తారు. కేవలం మనుషుల దిన, వార, మాస ఫలితాలనే గాక, ఫలానా సంవత్సరం ఏ దేశంలో ఎలాటి మార్పులూ, చేర్పులూ, ప్రకృతి బీభత్సాలూ, రాజకీయ పరిణామాలూ, అతివృష్టి, అనావృష్టులూ సంభవించబోతున్నాయో ఖచ్చితంగా అంచనావేసి చెప్పగలుగుతున్నారు.

ఇవన్నీ పరిశీలించాకనే విశ్వనాధం గారి మస్తిష్కంలో ఆ వినూతన పథకానికి అంకురార్పణ జరిగింది. అనేక కోణాలనించి ఆచి-తూచి ముందు ఓ ఆస్ట్రానమికల్ కంప్యూటర్ని రూపొందించారు. తరవాత ప్రత్యేకంగా తయారుచేసిన ఒక టెలివిజన్ సెట్‌తో దాన్ని అనుసంధించి, కంప్యూటర్ కోసం ఒక ప్రత్యేక ప్రోగ్రామింగ్ సిస్టమ్ సృష్టించారు.

ఇక చెయ్యవలసిందల్లా ఒక వ్యక్తి జనన కాలాన్ని తీసుకుని, దాని ఆధారంగా పంచ్‌కార్డ్, మ్యాగ్నటిక్ డిస్క్‌లపై ఫోర్‌ట్రాన్ భాషతో కూడిన కంప్యూటర్ ప్రోగ్రామింగ్ డేటాను పొందుపర్చి, దాని ఇన్‌పుట్‌లో ప్రవేశపెట్టి, బటన్లు పత్తాలి.

మరుక్షణం రాబోయే ఇరవైనాలుగ్గంటల్లో ఆ వ్యక్తికిసంభవించే ప్రమాదాలు, పరిణామాలూ, ఆనందాతిశయ ఘటనలూ, జయాపజయాలూ, లాభనష్టాలూ దృశ్యపరంగా సినిమా చూసినట్టు టెలివిజన్ తెరపై చూడవచ్చు.

! విన్నవాళ్ళ కిది బ్రహ్మాండమైన జోకుగానూ, ఎన్నటికీ సంభవంకాని జటిల విషయంగానూ తోచవచ్చు.... నూటాముప్పైఏళ్ళ క్రితం నికిఫోర్ నికిటోవ్ అనే రష్యన్ శాస్త్రవేత్త అంతరిక్షయాత్ర గురించీ, చంద్రమండలానికి ప్రయాణం గురించీ మాట్లాడినప్పుడు లోకం అతన్ని




పిచ్చివాడిగా భావించి, తిరుగుబాటుదారుడని నిందించి దేశంనించి బహిష్కరించింది!

ఆనాడు ఆ కాలజ్ఞాని అన్నమాటలే, ఊహలే ఈనాడు వాస్తవరూపం దాల్చలేదా? ప్రతిరోజూ మనం ఎక్కడో కొన్ని యోజనాల మైళ్ళ దూరాన ప్రసారమౌతున్న దృశ్యాలను ఇంట్లో కూర్చుని టెలివిజన్ పెట్టెలో చూడగలుగుతున్నప్పుడూ, ఇక్కడ టెలిప్రింటర్ అక్షరాలపై వేళ్ళు తాటించినంతనే ఎక్కడో వందలమైళ్ళ దూరంలో ఉన్న టెలెక్స్‌పై ఆ అక్షరాలు పొల్లుపోకుండా పడుతున్నప్పుడూ, మానవ జీవితానికే మూలకేంద్రమైన గుండెను తీసి మరో గుండెను అతికించగలుగుతున్నప్పుడూ, ఇది ఎందుకు సంభవం కాదు?

మా ఆస్ట్రోపామ్ టెలిస్కేనర్లో అతి కీలక పాత్ర నిర్వహించేది కంప్యూటర్ విభాగమే! ఈనాడు కంప్యూటర్ చెయ్యలేని పనంటూ దాదాపు లేదనే చెప్పాలి. మానవ మేధస్సునించి రూపాంతరం చెందిన కంప్యూటర్ తిరిగి మానవ మేధస్సునే ఇప్పుడు సవాలు చేస్తోంది.

ఈ మధ్య బ్రిటన్‌లో నలుపూ, తెలుపూ సినిమాలను రంగుల సినిమాలుగా మార్చే కంప్యూటర్‌కూడా కనుక్కోబడింది. దాని ద్వారా ఇప్పుడు బ్లాక్ అండ్ వైట్ ఫిల్ముల్లోనే చెట్లకు ఆకుపచ్చరంగూ, ఆకాశానికి, నీళ్ళకూ నీలిరంగూ, మంటలకు ఎరుపురంగు వేసుకోవచ్చన్నమాట!

నా ఆలోచనా ప్రవంతికి ఆనకట్ట వేస్తూ లేబరేటరీ తలుపు తెరుచుకుంది. నుదుటిమీద స్వేదబిందువుల్ని పైటతో అద్దుకుంటూ ఇవతలకి వచ్చి, నా ముందు కుర్చీలో చతికిలబడింది సుమలత. నిశ్శబ్దాన్ని ఛేదించకుండా కళ్ళతోనే ప్రశ్నించానామెను. తనపని సంతృప్తికరంగా ముగిసినట్టు తలూపింది.

మా మధ్య ఆ మౌనానికి కారణం లేకపోలేదు. లాబరేటరీలో ప్రొఫెసర్ గారు ఒంటరిగా ఉన్నారు. లోపల ఏ చిన్న చప్పుడైనా స్పష్టంగా విని, ఏం జరిగిందోతక్షణం అంచనావేసుకోవాలన్న ఆరాటంతో మా గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. అందుకే సూదిపడితే వినిపించే ఆ నిశ్శబ్దాన్ని మా మధ్య ఇష్టంలేకున్నా సృష్టించుకున్నాము.

క్షణాలూ, నిముషాలూ మా గుండెగతకులకు లయగా తాళంవేస్తూ పరిగెడుతున్నాయి.

అంతలో హఠాత్తుగా లోపల 'ఫెళ్ళు' మని పెద్ద చప్పుడు వినిపించింది. అంతే! "నాన్నా!" అంటూ లేచి పరిగెత్తబోయింది సుమలత.

ఒక్క ఉదుటున ఆమె చెయ్యి పట్టుకున్నాను. "తొందరపడకు. ముందు

నన్ను వెళ్ళి చూడనివ్వు." అంటూ లేబరేటరీ వైపు అడుగువేశాను.

సరిగ్గా అప్పుడే తలుపు తెరుచుకుని ఇవతలికి వచ్చారు ప్రొఫెసర్.

ఆయన్ని చూశాక మా ప్రాణాలు మళ్ళీ మామూలు స్థాయికి వచ్చేశాయి.

"భయపడ్డారా? ఆనందాన్ని అదుపులో పెట్టలేక అదరాబాదరా వస్తూ చెయ్యి గ్లాస్‌జార్‌కు తగిలి కిందపడింది. అంతే! రండి. మానవ ప్రయత్నానికి దైవానుగ్రహం తోడైతే మనిషి సాధించలేనిదంటూ లేదన్న సత్యాన్ని మీకు చూపిస్తాను," అంటూ మళ్ళీ లోపలికి నడిచారు ప్రొఫెసర్.

ఇద్దరం గబగబ ఆయన వెంట లాబ్‌లో కెళ్ళాము.

"శ్రీధర్! ముందు నీతో ప్రారంభిద్దాం! నీ డేటాఫ్‌బర్త్ మర్చిపోయాను. రాసివ్వు." అన్నారు ప్రొఫెసర్.

కాగితంమీద రాసిచ్చాను. 14-4-1954.

ఆయన పంచ్‌కార్డ్, మ్యాగ్నెటిక్ టేప్, మ్యాగ్నెటిక్ డిస్క్‌లు అందుకుని, క్యాల్కులేటర్లో ఏవేవో అంకెలు గుణిస్తూ వాటిపై ఫోర్‌ట్రాన్ భాషతో కూడిన కంప్యూటర్ డేటా ప్రోగ్రామింగ్ పొందుపర్చి, వాటిని కంప్యూటర్ ఇన్‌పుట్‌లో ప్రవేశపెట్టి, టకటక బటన్లు వత్తారు. మరుక్షణం దానిమీద నీలిరంగు బల్బు వెలిగి ఆరిపోయి, ఎరుపురంగు బల్బు వెలిగింది. సెకెను తరవాత అదీ ఆగిపోయి ఆకుపచ్చరంగు బల్బువెలిగింది.

వెంటనే ఆయన టెలివిజన్ ఆన్‌జేసి, చానల్ తిప్పారు. అంతవరకూ బూడిద రంగులో ఉన్న స్క్రీన్ దేదీప్యమైన వెలుగుతో నిండిపోయింది. స్క్రీన్ పక్కనే ఉన్న తేదీ, వారమూ, నెలా, సంవత్సరం తెల్పే రోలర్స్ నెమ్మదిగా తిరగనారంభించాయి. ఆగష్టు 11, బేస్త వారం, 1983 దగ్గర ఆగిపోయాయి.

ఇక టైమింగ్ రోలర్స్ తిరగసాగాయి. సాయంత్రం ఐదుగంటల ఎనిమిది నిమిషాలు.... స్క్రీన్ మీద ఒక దృశ్యం కాసేపు మసకమసకగా కదిలి, ఇప్పుడు స్పష్టంగా కనిపించసాగింది. అది ప్రొఫెసర్‌గారి ఇంటి ముందు కారు పార్క్‌జేసే పోర్చ్. మెయిన్ గేటుగుండా అప్పుడే కారువచ్చి పోర్చ్‌లో ఆగింది.

డ్రైవింగ్ సీట్లోంచి ఓ యువతి దిగి, వెనకసీటు తలుపు తెరిచి పట్టుకుంది. వెంటనే పోల్చుకున్నాను ఆ యువతిని. ఆమె ప్రొఫెసర్‌గారింటి కెదురింట్లో ఉండే గణేశన్‌గారి గారాలపట్టి పద్మజ! అంతలో, ఓ వ్యక్తి నెమ్మదిగా వరండా మెట్లు దిగుతూ వెళ్ళి ఆ కారు వెనక సీట్లో కూర్చున్నాడు.

పద్మజ డోర్‌మూసి, తిరిగి డ్రైవింగ్ సీట్లో కూర్చుని, కారు మెయిన్‌గేటు గుండా బైటికి పోనిచ్చింది. ఆ వ్యక్తిని గుర్తుపట్టిన మరుక్షణం దిగ్భ్రాంతితో నా కళ్ళు పెద్దవయ్యాయి. అతను ఎవ్వరో కాదు. నేనే!

సరిగ్గా అప్పుడే ప్రొఫెసర్ స్విచ్ ఆఫ్‌జేసి, "చూశావా? రేపు సాయంత్రం ఐదుగంటల ఎనిమిదీ, పదినిమిషాలమధ్య నీ విషయంలో జరిగే అతి ముఖ్య సంఘటన అది!" అన్నారు.

సుమలతా, నేనూ ఆశ్చర్యంతో ఒకరి మొహాలొకరం చూసుకున్నాం. కారణం, ఆ అమ్మాయితో నాకు ఎటువంటి పరిచయమూ లేదు. ఆమె పేరు పద్మజ అనీ, వాళ్ళ నాన్న గణేశన్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ ఫైనాన్స్‌గా పనిచేస్తున్నాడనీ, తమిళులనీ సుమలత చెబితేనే తెలిసింది నాకు.

పైగా, నేను ఒకరి కార్లో కూర్చుని ఇంటికెళ్ళే సమస్యే లేదు. కారణం, మా ఇల్లు ఇక్కడికి కేవలం అరఫర్లాంగు దూరంలోనే ఉంది. ఐతే, నేను ప్రొఫెసర్‌గారింటికి వచ్చేపోయే సమయాల్లో ఆ అమ్మాయి తమఇంటి పోర్టికోలోనో, మెయిన్‌గేటు ముందో నిల్చుని తరుచూ నా వైపు ఆసక్తిగా చూడటం, అప్పుడప్పుడూ పరిచయ పూర్వకంగా నవ్వడం గుర్తొస్తున్నాయి.

నా ఆలోచనలలో నిమిత్తం లేకుండా, "ప్రతి యువతికి తన కాబోయే జీవిత భాగస్వామి గురించి కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలూ, ఆలోచనలూ ఉంటాయి. అలాగే ప్రతి తండ్రికీ తన కూతురి సహచరుడు సద్గుణ సంపన్నుడూ, ఉత్తముడూ అయి ఉండాలన్న ఆశ లుంటాయి. చూద్దాం! నా తల్లి సుమలత విషయంలో విధి నిర్ణయం ఎలా ఉందో?" అంటూ కంప్యూటర్‌కు ప్రోగ్రాం అందించి బటన్లు వత్తారు ప్రొఫెసర్.

టెలిస్క్రీన్‌మీద మళ్ళీ ఒక దృశ్యం కదలాడి, క్రమంగా స్పష్టం కాసాగింది. అది పెళ్ళి మంటపం. పెళ్ళి పీటలపై కూర్చున్న వధూవరుల్లో పుత్తడి బొమ్మలా ఉన్న సుమలతని ఇట్టే పోల్చుకున్నాను. ఆమె పక్కన మల్లెపువ్వులాటి తెల్లని చొక్కా, ధోవతిలో కూర్చున్నవరుణ్ణిచూసి, ఆశ్చర్యానందాలు ఉత్తుంగతరంగాల్లా ఉవ్వెంగా యినాలో. ఆ వరుణ్ణి నేనేనండోయ్!!

మరుక్షణం పట్టుబడ్డ దొంగల్లా సిగ్గుపడుతూ తలలు వంచుకున్నాం ఇద్దరం.

ఆయన స్విచ్ ఆఫ్‌చేసి, చిన్నగా నవ్వుతూ నా భుజం తట్టారు. "విధి ఆ నిర్ణయం తీసుకుని పొరపాటు చెయ్యలేదు బాబూ! నేను కోరుకున్నదీ, ఆశించింది కూడా అదే!" అన్నారు ఆప్యాయంగా.

అప్పుడు కుదుటపడింది మనసు. క్రీగంట చూశాను సుమలతవైపు. ఆమె చెక్కిళ్ళు సంజెవేళ నీలాకాశంలో పరుచుకునే అరుణిమ వర్ణాన్ని సంతరించుకున్నాయి.

"మానవ భవిష్యత్తు ఇంతకాలం

చీకటిమరుగున ఉండేది. మన కృషివల్ల ఇప్పుడు ప్రతిఒక్కరూ తమ భవిష్యత్తును కళ్ళతో ప్రత్యక్షంగా వీక్షించే వీలు కలిగింది. ఈ విషయాన్ని వెంటనే లోకానికి చాటిచెప్పాలి. జర్నలిస్టుల్ని ఆహ్వానించి వారికి వినూతన సృష్టిని చూపించాలి. ఆ ఏర్పాట్లేవో మీరిద్దరూ కలిసి పూర్తిచెయ్యండి." అన్నారు ప్రొఫెసర్.

## 2

మర్నాడంతా స్థానిక పత్రికాఫీసులకూ, ఆకాశవాణి వార్తా విలేఖరులకూ ఫోన్లు చెయ్యడంతోనూ, ఇతర రాష్ట్రాల న్యూస్ ఏజెన్సీలకు సందేశాలు పంపడంతోనూ సరిపోయింది. సెప్టెంబర్ మూడవ తేదీన ఆయా జర్నలిస్టులందరూ ప్రొఫెసర్‌గారింట్లో సమావేశం కావాలని ఆహ్వానించాం.

సాయంత్రం ఐదు గంటలకు అలసి సొలసి ఇంటికి బైలుదేరుదామని ఇవతలికి వచ్చాను. వరండా మెట్లు దిగబోతున్నానో లేదో, ప్రొఫెసర్‌గారి పెంపుడు కుక్క పిల్లని తరుముతూ విసురుగా నా కాళ్ళకడ్డం వచ్చింది. అంతే!

కుడికాలు మడతబడి, దభీమంటూ అక్కడే కూలిపోయాను. ఆ షాక్ లోంచి తేరుకోడానికి రెండు నిమిషాలు పట్టింది. లేచి నిల్చోబోతే కాలి మడమలో తీవ్రమైన నెప్పి పుట్టి నరాలను జలదరింపజేసింది.

"వాట్ హేపెండ్ టు యూ మిస్టర్ శ్రీధర్!" అన్న సుతిమెత్తని కంఠం విని అటు చూశాను. ఎదురింటి పద్మజ హడావుడిగా వస్తూ కనిపించింది.

బలవంతంగా నవ్వి, "అబ్బే, ఏం లేదు, కాలు బెణికింది!" అనగలిగాను అతి కష్టంమీద.

"ఇప్పుడెలా వెళతారు ఇంటికి? సమయానికి ప్రొఫెసర్‌గారి కారు కూడా లేనట్టుందే!" అంటూ చుట్టూ కలయజూసిందామె.

"ఔను. డ్రైవర్ దాన్ని సర్వీస్ స్టేషన్‌కు తీసికెళ్ళాడు." చెప్పాను.

"డోంట్ వర్రీ! మిమ్మల్ని నా కార్లో డ్రాప్‌చేస్తానండి." అంటూ నా జవాబు వినకుండా చకచక ఇంటివైపు కదిలింది పద్మజ.

లోపలున్న సుమలతని పిలుద్దామనుకుంటుండగానే తన నీలిరంగు ఫియట్ కారు తెచ్చి పోర్చిలో ఆపింది. మరో గత్యంతరం లేక నెమ్మదిగా మెట్లుదిగి ఆమె తెరిచి పెట్టిన బాక్‌సీట్లో కూర్చున్నాను. పద్మజ వెంటనే డోర్ మూసి, కారు స్టార్ట్‌జేసి ముందుకు పోనిచ్చింది.

తటిల్లతలా అప్పుడు తళుక్కుమంది నా బుర్రలో నిన్న టెలిస్కేనర్లో చూసిన దృశ్యం! చటుక్కున రిస్టువాచీ చూసుకున్నాను. సరిగ్గా ఐదుగంటల పది నిమిషాలు! కారు గేటుదాటి కుడివైపు తిరుగుతుండగా తలతిప్పి ఇంటివైపు చూశాను. శబ్దానికిసుమలత ఇవతలకివచ్చి, ఆశ్చర్యంతో నోరు తెరిచి చూడసాగింది మమ్మల్ని.

మా ఆహ్వానాల మేరకు సెప్టెంబర్ మూడవ తేదీన జర్నలిస్టులంతా ప్రొఫెసర్‌గారి విశాలమైన హాల్లో సమావేశమయ్యారు. వారి కెదురుగా ఎత్తైన వేదిక మీద టెలిస్కేనర్ అమర్చాం! ప్రొఫెసర్ ముందు దాని పుట్టుపూర్వోత్తరాలు వివరించి, పనిచేసే విధానం తెలిపి, రాబోవు ఇరవై నాలుగ్గంటల్లో వారివారి వ్యక్తిగత జీవితాల్లో ఏం జరుగుతాయో ప్రత్యక్షంగా ముందు చూపిస్తాననీ, అనుభవ పూర్వకంగా అవి నిజమయ్యాకే పత్రికల్లో తమ అభిప్రాయాలు వెళ్ళడించమనీ అభ్యర్థించారు.

ఆయన కోరిన విధంగా జర్నలిస్టులంతా తమతమ జన్మ నక్షత్రాలూ, రాశులూ, జనన తేదీలూ చీటీలపై రాసి రెడీగాపెట్టుకున్నారు. ప్రొఫెసర్ ఒక్కొక్కరి వివరాలు తీసుకుని కంప్యూటర్లో పొందుపరుస్తూ, టెలివిజన్‌పై రేపు జరగబోయే సంఘటల్ని చూపసాగారు.

ఆ కార్యక్రమం జరుగుతున్నంతసేపూ అందరి మొహాల్లోనూ దిగ్భ్రాంతి కాపురం పెట్టింది.

రెండురోజుల తరవాత దేశంలోని పత్రికలన్నీ మా వినూతన సృష్టిగురించే తాటికాయంత అక్షరాలతో సంభ్రమాశ్చర్యాలు వ్యక్తంజేస్తూ వార్తలూ, వ్యాసాలూ ప్రచురించాయి.

క్షణాల్లో ఆ విషయం ప్రపంచ వార్తల్లో కెక్కి, దిశదిశలనుంచీ మాకు టెలిగ్రాములూ, టెలెక్స్లూ, లైటెనింగ్ కాల్సూ కుప్పతెప్పలుగా రాసాగాయి. ప్రతి ఒక్కరూ తమ సందేశంలో ఆ మాయాదర్పణాన్ని ప్రత్యక్షంగా చూడాలన్న ఆకాంక్షనే వ్యక్తంజెయ్యసాగారు.

ఒకరోజు ప్రొఫెసర్ నన్నూ, సుమలతనూ సమావేశపర్చి, "కొంతకాలం నేను అజ్ఞాతవాసంలో ఉండి, ఓ వినూతన ప్రయోగంలో విలీనం కావాలనుకుంటున్నాను. అది కేవలం నాకు సంబంధించినవిషయం! అందులో మీ ప్రమేయమేమీ ఉండదు. ఆలోగా మీరిద్దరూ టెలిస్కేనర్ విధుల్ని చూస్తూ, దానిపై ప్రపంచ ప్రజల అభిప్రాయాలు సమీకరిస్తూ ఉండండి." అన్నారు.

ఆ రోజుతో ఆయన తనని తాను పూర్తిగా లేబొరేటరీ పరిధికే పరిమితం జేసుకున్నారు.

మేము టెలిస్కేనర్ని చూడాలనుకున్నవారికి చూపడం, కుప్పతెప్పలుగా వచ్చి పడుతున్న అభినందనలకు ధన్యవాదాలు తెల్పడం, పత్రికా విలేఖరులకు ఇంటర్వ్యూ లివ్వడంతో సతమతం కాసాగాము.

అలా నెలరోజులు గడిచాయి.

అంతలో ఢిల్లీనుండి విదేశాంగ మంత్రి పంపిన ఓ ప్రత్యేక సందేశం

అందింది మాకు. తాను టెలిస్కానర్ గురించి తెలుసుకుని ముందు నమ్మలేక పోయాననీ, తరవాత ప్రపంచ వార్తలు చదివి, ఒక భారతీయుడు అందునా ఆంధ్రుడు అటువంటి అద్భుత సృష్టికి కారణభూతుడైనందుకు ఎంతో గర్వించాననీ, తనతోబాటు రాజధానిలో నివసిస్తున్న ప్రముఖులూ, ప్రపంచ దేశాల ప్రతినిధులూ, రాయబారులూ ఆ యంత్రాన్ని ప్రత్యక్షంగా చూడాలని ఉత్సుకతతో ఉన్నామనీ, మాకు ఎప్పుడు వీలుంటుందో తెల్పితే అక్కడ అన్ని ఏర్పాట్లూ జరుగుతుతాయనీ సూచించారు.

ఆ మర్నాడే ప్రొఫెసర్ లాబొరేటరీ వదిలించి బైటికి వచ్చి, తన ప్రయోగ ఫలితం సంతృప్తికరంగా వచ్చిందని చెప్పి, అంతవరకూ జరిగిన విశేషాలు తెలుసుకున్నారు.

అదేరోజుమంత్రికి జవాబుపంపించాం కేబుల్ ద్వారా: అక్టోబర్ పదకొండవ తేదీన ఢిల్లీలో మా ప్రదర్శన ఉంటుందనీ, పనిలో పనిగా వివిధ దేశాల శాస్త్రజ్ఞుల్ని కూడా ప్రభుత్వ అతిధులుగా ఆహ్వానిస్తే బావుంటుందనీ సూచించాము.

వెంటనే మా జవాబుకు ప్రత్యుత్తరం అందింది. మా సూచన నచ్చిందనీ, త్వరలో ఏర్పాట్లు పూర్తి జేస్తామనీ, అక్టోబర్ పదవ తేదీన మమల్ని ఢిల్లీ మోసుకెళ్ళడానికి ఓ విమానం కేటాయించబడుతుందనీ తెల్పారు.

అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరిగి, అక్టోబర్ పదకొండవ తేదీన విశాలమైన ఒక హాల్లో ప్రముఖులందరూ సమావేశం కాగా, మా ప్రదర్శన ప్రారంభమైంది. ప్రదర్శన చూస్తున్నంతసేపూ అందరి మొహాల్లోనూ ఆశ్చర్యాతిశయాలు ప్రస్ఫుటం కాసాగాయి.

ప్రొఫెసర్‌గారు వంతు వంతున అందరికీ వారివారి భవిష్యత్తులు చూపి, ఆ కార్యక్రమం ముగిశాక, మైకు ముందుకెళ్ళి అందర్నీ సంబోధించారు.

"గౌరవనీయులైన అతిథి మహాశయులకు - వందనాలు! ఇంతవరకూ నేను కేవలం మానవుల భవిష్యత్కార్యక్రమాలనే మా ఆస్ట్రోస్కోప్ టెలిస్కానర్లో చూపించాను. ఇప్పుడు మానవ మనుగడకూ, శతకోటిప్రాణుల జీవన భృతికి ఆధార భూతమైన ఈ భూమి భవిష్యత్తు కూడా చూపి, మిమ్మల్ని చకితుల్ని చెయ్యాలనుకుంటున్నాను.

రాబోవు సంవత్సర కాలంలో ఈ భూమండలంమీద ఎటువంటి పరిణామాలు సంభవించనున్నాయో మీరు ప్రత్యక్షంగా చూసి, పరిస్థితుల్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోగలరని ఆశిస్తున్నాను." అని, మేగ్నెటిక్ డిస్కుమీద కంప్యూటర్ ప్రోగ్రాంను రూపొందించడంలోనిమగ్నమయ్యారు ప్రొఫెసర్.

ప్రోగ్రాం తయారై- ఇన్‌పుట్‌లోకి వెళ్ళడం, టెలివిజన్ ఆన్ కావడంతో టైమింగ్ రోల్స్ నెమ్మదిగా తిరుగుతూ 1984 మే ఆరవతేదీ, సాయంత్రం ఏడు గంటల రెండు నిమిషాల పన్నెండు సెకెండ్లు చూపుతూ ఆగిపోయాయి.

స్క్రీన్‌మీద ఓ ప్రఖ్యాత విదేశీ నగర దృశ్యం కనిపించసాగింది. ఉన్నట్టుండి ఆకాశంనించి రాకెట్‌లాంటిదేదో దూసుకువచ్చి నగరం నడిబొడ్డున పడింది. అంతే! భయంకరమైన ప్రేలుడుతో భవనాలూ, మనుషులూ, కార్లూ తునాతునకలై చెల్లాచెదురైపోయారు. ఆ వెంటనే మరో నగరం లిప్తపాటులో ప్రేలి భస్మీపటలమైపోయింది.

ఆ తరవాత గగనతలంనించి రివ్వురివ్వున దూసుకువచ్చే బాంబుల తాకిడితో, భీకరప్రేలుళ్ళతో నగరాలకి నగరాలే నామరూపాల్లేకుండా నాశనం కాసాగాయి. వాటితోబాటు అడవులూ, గుట్టలూ, పుట్టలూ ప్రళయం ముంచుకు వచ్చినట్టు చెల్లాచెదురై పోసాగాయి.

సముద్రాలూ, సరస్సులూ, నదులూ, చెఱువులూ చాపచుట్టల్లా చుట్టుకుపోతూ నిలువెత్తు అలలతో ప్రళయతాండవం చెయ్యసాగాయి. నేల పెద్ద పెద్ద బీటలుగా విడిపోతూ ఆకాశ హర్మ్యాలనూ, సౌధాలనూ తనలో ఇముడ్చుకోసాగింది.

ఎటుచూసినా పశుపక్షాదుల మానవ కళేబరాలే! తలలూ, మొండాలూ, కాళ్ళూ, చేతులూ తెగిపడ్డ శరీరాలే! ఎంతోసేపటికిగానీ ఆ భీభత్సదృశ్యాలు సద్దుమణగలేదు తెరపై. ఆ తరవాత, కనుచూపుమేరవరకూ ప్రాణి అనేది కానరాని దృశ్యాలు ప్రత్యక్షం కాసాగాయి.

ప్రొఫెసర్ టెలివిజన్ స్విచ్ ఆఫ్ జేసి, మైక్ అందుకున్నారు. "మహాశయులారా! వచ్చే సంవత్సరం మే ఆరవ తేదీన, సాయంత్రం ఏడు గంటల రెండు నిమిషాల పన్నెండు సెకెండ్లకు మూడవ ప్రపంచయుద్ధం ప్రారంభం కావడం, తద్వారా జరిగే పరిణామాలూ మీరు ప్రత్యక్షంగా చూశారిప్పుడు. అంటే ఈ పుడిమిపై ప్రాణికోటి ఆయువు ఇక అట్టే కాలం లేదన్నమాట!

ఈ మధ్య ఒక అగ్రరాజ్యపు అణు విధ్వంసక క్షిపణిస్థావరంలోని రాడార్ ట్రాన్స్‌మీటర్ తమ మీద మరో అగ్రరాజ్యం దాడిచెయ్యబోతున్నట్టు తప్పుడు సంకేతాలు ఇవ్వడంతో ఆ అగ్రరాజ్య ఫైటర్ బాంబర్లు ఆ దాడిని ఎదుర్కొడానికి హుటాహుటిన గగనతలంలోకి దూసుకుపోవడం, వెనువెంటనే అది తప్పుడు సమాచారం అని తెలిసి, వెనుదిరిగి రావడం అందరికీ తెలిసిన విషయమే!

అలా పొరపాటునో, గ్రహపాటునో ప్రారంభమయ్యే అణుయుద్ధం ఈ భూతలంమీద ప్రాణికోటిని ఎలా తుడిచిపెట్టబోతుందో మీరు కళ్ళారా చూశారు.

భగవంతుడు మనిషికి ప్రదానం జేసిన జీవితం బహు స్వల్పం! అన్ని జన్మల్లోనూ మానవజన్మ అత్యున్నతం. అటువంటి బహుస్వల్పకాలిక అత్యున్నత జీవితాన్ని పరస్పర ప్రేమానురాగాలతో, శాంతికాముకతతో ఆనందమయంగా జీవించక, ద్వేషమనే బడబాగ్నిలో తనని తాను ఎందుకు భస్మం చేసుకుంటున్నారీ మానవులు? యుద్ధమనే భీకర జ్వాలల్లో తమని తాము ఎందుకు తుడిచి పెట్టుకుంటున్నారీ దానవులు?

మానవ మేధస్సునించి జనించిన ఆ మారణాయుధాలు మానవ మనుగడనే మటుమాయం చెయ్యడానికి తప్ప మరి ఎందుకు పనికొస్తాయి? కోటానుకోట్ల రూపాయలూ, మేధస్సూ వెచ్చించి, కుప్పతెప్పలుగా ఆ వస్త్రాలను కూడబెట్టే బదులు ఆ ధనాన్నీ, మేధస్సునూ లోకకళ్యాణానికి ఎందుకు వెచ్చించకూడదు?

నాలాంటి అల్పజీవి మీవంటి పెద్దలకు సలహాలివ్వడం సమంజసం కాదు. జరగబోయే విపత్తును కళ్ళారా చూసిన మీరు ఏం నిర్ణయించుకుంటారో అది మీకే వదిలేస్తున్నాను....” అంటూ భారంగా నిట్టూర్చి, మైకు ముందునించి తప్పుకున్నారు.

అంతే! సభలో కలకలం ప్రారంభమైంది. అందరి మొహాల్లోనూ భయాందోళనలు కొట్టవచ్చినట్టు కనిపించసాగాయి. బహుశా, మృత్యుభయం అంటే ఏమిటో అప్పుడు ఆ పెద్దలకు తెలిసినట్టుంది. తమలో తాము తర్జన భర్జనలు చేసుకోసాగారు. అరగంట తరవాతగానీ, ఆ గందరగోళం సద్దుమణగలేదు.

ఆ వెంటనే ముందు వరసలో కూర్చున్న ఓ అగ్రరాజ్య రాయబారి వేదిక ఎక్కి ఆవేశంతో సకల మానవ శ్రేయస్సునూ, శాంతి సౌభ్రాతృత్వాన్నీ కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకునే సమయం ఆసన్నమైందనీ, లేనిపక్షంలో ఈ భూమండలం యావత్తూ పెద్ద స్మశానవాటికగా మారిపోయే ప్రమాదం ఉందనీ హెచ్చరించి, ఆ విపత్తు సంభవించకముందే తమ ప్రభుత్వంతో శక్తి వంచన లేకుండా సంప్రదించి, తనవంతు పాత్రను త్రికరణశుద్ధిగా నిర్వహిస్తానని ప్రమాణం జేశాడు.

ఆయన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ మిగతాదేశాల రాయబారులు కూడా వేదిక ఎక్కి శాంతి ప్రవచనాలు వల్లిస్తూ ఉద్వేగపూరిత ఉపన్యాసాలిచ్చారు.

ఆ సభ ముగియగానే విదేశాంగ మంత్రి మమ్మల్ని కలుసుకుని, తనూ, ప్రధానీ ఎంతోకాలంగా అణ్వాయుధ వ్యాప్తిని అరికట్టడానికి కృషిచేస్తున్నా, ఆశించిన ఫలితం ప్రాప్తించలేదనీ ఈ విధంగా అనతికాలంలోనే ప్రపంచానికి ఆ మహమ్మారి ఆయుధపీడ విరగడయ్యే సూచనలు కానవస్తున్నాయనీ,కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

ఆయన ఊహించినట్టే ప్రపంచ ప్రజలంతా వెల్లువలా ఏకమై, అణ్వాయుధాలపట్ల తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తంజేస్తూ ప్రదర్శనలు ప్రారంభించారు.

దాంతో, అగ్రరాజ్యాలు మిగతా విషయాలను పక్కకునెట్టి, వాటిని విసర్జించడానికి, ప్రపంచంలో శాంతిసుస్థిరతలు స్థాపించడానికి హుటాహుటిన సంప్రదింపులు ప్రారంభించాయి.

## 4

ఢిల్లీనించి తిరుగుప్రయాణమై, ప్రొఫెసర్‌గారింటికి చేరగానే అంతవరకూ నాలో దాగుడుమూతలాడుతున్న సందేహాన్ని ఇక తొక్కిపట్టలేక, “మీరు మాకు నూరిపోసిన థియరీప్రకారం మన టెలిస్కోనర్ కేవలం మానవుల భవితవ్యాన్నే చూపెడుతుంది కదా? మరి ఆ రాయబారులముందు భూమి భవిష్యత్తును ఎలా చూపగలిగింది?” అడిగానుసూటిగా.

అందుకాయన చిన్నగానవ్వి, నన్నూ, సుమలతనీ లాబరేటరీలోకి తీసికెళ్ళి, కూర్చోబెట్టి, నింపాదిగా చెప్పసాగారు. “మొదటినించీ నేను మారణాయుధాలకు బద్ధవ్యతిరేకిని. ఈనాడు అగ్రరాజ్యాలు ఒకదానిపై ఒకటి పోటీపడుతూ కుప్పతెప్పలుగా వాటిని సమీకరించుకుంటున్నాయి.

వాటి ప్రోద్బలంతో ఈ మధ్య కొన్ని జానెడుదేశాలు కూడా అణ్వాయుధాలు నిర్మించడానికి ఉద్యుక్తమౌతున్నాయి.

ఎప్పుడైతే నేను టెలిస్కోనర్ని రూపొందించదలిచానో అప్పుడే ఈ ఆలోచన నాలో బీజం వేసుకుంది! అది మానవ భవిష్యత్తును పొల్లుపోకుండా చూపడం వరకూ నిజమే! ఐతే, రాయబారుల ముందు చూపిన ప్రపంచ వినాశకర విషయాలన్నీ నేను స్వయంగా సృష్టించినవే!!”

ఆశ్చర్యంతో విప్పారాయి నా కళ్ళు!

తన ధోరణిలో చెప్పుకుపోసాగారాయన. “నెలరోజులు నేను అజ్ఞాతవాసం ఎందుకు చేశాననుకున్నారు? దాని సృష్టికోసమే! ఐదేళ్ళనించీ ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి, వివిధ దేశాలు పర్యటించి, లెక్కకు మిక్కిలి సినిమాలు చూస్తూ, వాటిలోని భీభత్స దృశ్యాలను వీడియో కెమేరాలో బంధిస్తూ అనేక దృశ్యాలు సేకరించాను.

తరవాత వాటిని కావలసిన నిడివిలో ఎడిట్ చేసి, క్రమబద్ధంగా పేర్చి, మన టెలిస్కోనర్ కోసం ప్రత్యేకమైన ఓ వీడియో కాసెట్ తయారు జేసాను....

ముందు రాయబారులకు వారి భవిష్యత్తులు చూపి, పూర్తి నమ్మకం కలిగించి, అ ఊపులోనే ఆ వీడియో టెలిస్కోనర్లో అమర్చి, ప్రపంచ వినాశకర దృశ్యాలుగా భ్రమింపజేసి. భయభ్రాంతులకు గురిచేశాను.

ఏది ఏమైనా, నా కోరిక ఫలించింది. ఆశయం సిద్ధించింది. అంతకు మించి శాంతిని అపేక్షించే ఒక సామాన్య వ్యక్తి కోరుకునేది ఏముంది?”

వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యమంటారు. అలాగే, సకల మానవ శ్రేయస్సుకోసం ఆయన అనుసరించిన విధానం తప్పుగా తోచలేదు నాకు. ఏకీభవించాను మనస్ఫూర్తిగా!